క్లుప్తంగా

స.హ. చట్టంపై అవగాహన పెంచుకోవాలి

మునగపాక: ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్నకుమారి కోరారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై మహిళా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రజలకు వజ్రాయుధం లాంటిదన్నారు. ఈ చట్టాన్ని పార్లమెంట్ 2005 జూన్ 12న ఆమోదించిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పలు సమాచారం కోసం ఈ చట్టాన్ని ఉపయోగించుకుంటే సకాలంలో సేవలందుతాయన్నారు.

ఉపాధి హామీ పథకంతో గ్రామాలాభివృద్ధి

మునగపాక: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతాయని టి.సిరసపల్లి సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి అన్నారు. సిరసపల్లి సచివాలయంలో మంగళవారం ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా రహదారులు, కాలువలతో పాటు ఇతర అభివృద్ధి పనులకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, సోషల్ ఆడిట్ సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

మునగపాక: మండలంలోని టి.సిరసపల్లి శ్మశానవాటికలో నిర్మిస్తున్న సీసీ రోడ్డును టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, తదితరులు మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల ఇంజినీరింగ్ అధికారి గులామ్, నాగేశ్వరరావు, నవీన్ పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో సీపీఎం ప్రజా పోరు

అచ్యుతాపురం: ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో అచ్యుతాపురంలో మంగళవారం ప్రజా పోరు నిర్వహించారు. ఈ సందర్భంగా పెరుగుతున్న నిత్యావసర ధరలు, విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయం వంటి పలు అంశాలపై నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్.రాము, అప్పారావునాయుడు, రామకృష్ణ, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

వారోత్సవాలకు గ్రంథాలయాలు ముస్తాబు

పాయకరావుపేట: బాలల దినోత్సవం నాడు ఈ నెల 14న ప్రారంభం కానున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు గ్రంథాలయాలు ముస్తాబవుతున్నాయి. 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించానున్నారు. 14న జాతీయ పతకావిష్కరణ, నెహ్రూ జయంతి వేడుకలు, బాలల దినోత్సవం, చదరంగం పోటీలు జరగనున్నాయి. 15న క్విజ్, వక్తృత్వ, 16న గ్రంథాలయోద్యమానికి కృషి చేసిన ప్రముఖులకు నివాళులు, 17న పుస్తక ప్రదర్శన, యోగా ప్రాముఖ్యత, 18న అన్నమయ్య, దేశభక్తి గేయాలు, పాటల పోటీలు, 19న మహిళా దినోత్సవం, ఇందిరా గాంధీ జయంతి, ముగ్గుల పోటీలు, మహిళా సదస్సు, 20న వారోత్సవాలు ముగింపు కార్యక్రమం, ఆయా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేయనున్నట్లు గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు



ఇసుక నిల్వపై ప్రశ్నిస్తున్న తహసీల్దార్ రమేష్‌బాబు

ఎస్.రాయవరం: ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ జి.రమేష్‌బాబు హెచ్చరించారు. దార్లపూడి శివారులో శివ అనే వ్యక్తి నాటుబండితో ఇసుక తరలించి స్టాక్ చేస్తుండగా తహసీల్దార్ అటువైపుగా వెళ్తూ పరిశీలించారు. ఇసుక ఎందుకు నిల్వ చేస్తున్నావని ప్రశ్నించారు. ఇసుకతో పాటు బండిని సీజ్ చేసి వీఆర్వో జోగారావుకు అప్పగించారు. ఇళ్ల నిర్మాణాలకు ఉచిత ఇసుక తీసుకోవాలని చెబితే.. పట్టణాలకు తరలించి వ్యాపారం చేస్తారా? అని మండిపడ్డారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టే వారు పంచాయతీ కార్యదర్శి నుంచి లెటర్ తీసుకుని నదిలో ఇసుక తెచ్చుకోవాలన్నారు. ప్రభుత్వ కట్టాడాలకు కాంట్రాక్టర్ లెటర్ ఉండాలన్నారు. మండలంలో దార్లపూడి వద్ద మాత్రమే ఇసుక తీసేందుకు అవకాశం ఉందని, నదిలో 50 దూరంలో ఇసుక తవ్వేలా ఇరిగేషన్ అధికారులు చూడాలన్నారు. ఇసుక ఉచితం కదా అని నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

- ఏకోపాధ్యాయులతో నడుస్తున్న అత్యధిక పాఠశాలలు
- పర్యవేక్షణ లేక కొరవడిన మెరుగైన బోధన
- గత ప్రభుత్వంలో నాణ్యమైన విద్యతో ఉత్తమ ప్రమాణాలు
- మళ్లీ దుంపలబడులుగా మారే ప్రమాదం

కూటమి దెబ్బ.. సర్కారు బడులు కుదేలు..!



చినబొడ్డేపల్లి ఎంపీపీ స్కూల్



నాలుగు తరగతుల విద్యార్థులకు ఒకే చోట బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

కోటవురట్ల: కూటమి దెబ్బకు సర్కారు బడులు కుదేళ్లవుతున్నాయి. గత ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు ఓ వెలుగు వెలిగిన ప్రభుత్వ పాఠశాలలు ఇప్పుడు గాల్లో దీపాల్లా ఊగిసలాడుతున్నాయి. కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చెందిన ప్రభుత్వ పాఠశాలలు ఇప్పుడు కళ కోల్పోయి పాత కాలం నాటి బడులను గుర్తుకు తెస్తున్నాయి. 2019కు ముందు ప్రభుత్వ పాఠశాలలు దుంపలబడులుగా పేరొందగా.. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంస్కరణలతో అద్భుతంగా రూపుదిద్దుకున్నాయి. నాడు-నేడు ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నిండేలా మౌలిక వనరులను కల్పించారు. దాంతో విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. అలాగే ప్రతి చిన్నారికి బంగారు భవిష్యత్ అందేలా విద్యను ప్రోత్సహిస్తూ విద్యార్థుల తల్లుల అకౌంట్లలో నేరుగా ఏటా రూ.15 వేలు నగదు జమ చేసేవారు. జగనన్న విద్యా కానుక కిట్లు అందజేసి సగౌరవంగా బడికి వెళ్లేలా వసరులు కల్పించారు. జగనన్న గోరుముద్దతో ఆరోగ్యవంతమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించారు. నాణ్యమైన విద్యాబోధన జరిగేలా ఉపాధ్యాయులపై పర్యవేక్షణ, నిఘా ఉండేది. క్రమశిక్షణకు మారుపేరుగా ప్రభుత్వ పాఠశాలలు కనిపించేవి. కూటమి ప్రభుత్వం రాకతో ఇదంతా ఓ కలగా మిగిలిపోయింది. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పోయింది. తల్లికి వందనం అంటూ ఏకంగా ఎగనామం పెట్టారు. ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేలు చొప్పున నగదు ఇస్తామని మోసం చేశారు. విద్యా సంవత్సరం చివరికి చేరినా తల్లికి వందనం ఊసేలేదు.

చాలా బడుల్లో ఏకోపాధ్యాయులే..

కూటమి ప్రభుత్వం రాగానే విద్యార్థుల తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం సన్నగిల్లింది. దాంతో చాలా మంది తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు స్కూళ్లకు మార్చేశారు. కోటవురట్ల మండలంలో 51 పాఠశాలలు ఉండగా గత ప్రభుత్వ హయాంలో మొదటి ఫేజ్‌లో రూ.6.45 కోట్లతో 24 పాఠశాలలను అభివృద్ధి చేశారు. సెకండ్ ఫేజ్‌లో రూ.7.01 కోట్లతో 22 పాఠశాలలను అభివృద్ధి చేశారు. గతేడాది విద్యార్థుల సంఖ్య 3,405 ఉండగా ఈ ఏడాది 3,328కి తగ్గిపోయింది. వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్య మరింత తగ్గిపోయే పరిస్థితులు ఉన్నాయి. విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో ప్రస్తుతం 15 ఎంపీపీ స్కూళ్లు ఏకోపాధ్యాయులతో నడుస్తున్నాయి. రెగ్యులర్ ఉపాధ్యాయులు 108 మంది, ఎంటీఎస్ నలుగురు ఉన్నారు.

ఏకోపాధ్యాయ పాఠశాలలు ఇవే..

మండలంలోని ఏకోపాధ్యాయ పాఠశాలలైన అల్లమియ్యపాలెం ఎంపీపీ స్కూల్‌లో నలుగురు, చినబొడ్డేపల్లిలో 5, గవరపేటలో 3, జల్లూరు మెయిన్‌లో4, జల్లూరు ఎస్‌డబ్ల్యూలో 10, కె.వెంకటాపురం-1లో 5, కె.వెంకటాపురం-2లో 10, కోటవురట్లలో 4, కోటవురట్ల స్పెషల్‌లో 5, కొత్తూరులో 4, పాములవాకలో 12, సన్యాసిరాజుపాలెంలో 2, తడపర్తిలో 4, టి.జగ్గంపేటలో 12, తిమ్మాపురంలో ఐదుగురు విద్యార్థులు ఉన్నారు. వీరికి ఒక్కొక్క ఉపాధ్యాయుడే ఒకే తరగతి గదిలో కూర్చోబెట్టి బోధన చేస్తున్నారు.

ప్రభుత్వ స్కూళ్లపై నమ్మకం పోయింది



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్యకు పెద్ద పీట వేశారు. మాజీ సీఎం జగన్ ప్రభుత్వ పాఠశాలలను ఎంతగానో అభివృద్ధి చేశారు. అద్భుతమైన వనరులను విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. నాణ్యమైన విద్య అందేలా క్రమశిక్షణగా తీర్చిదిద్దారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు విరక్తి కలిగిస్తున్నాయి. తల్లిదండ్రులకు నమ్మకం పోయింది.

– పైల శివరాం, సర్పంచ్, చినబొడ్డేపల్లి

తల్లికి వందనం ఎగ్గొట్టారు..



కూటమి ప్రభుత్వం వస్తే ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి కూడా ఏటా రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. ఇప్పుడు విద్యా సంవత్సరం మధ్యలో ఉన్నా ఇంకా డబ్బులు వేయలేదు. అసలు వేస్తారో వేయరో కూడా తెలియడం లేదు. బడిలో పిల్లల పట్ల శ్రద్ధ తీసుకోవడంలేదు.

– బంగారు మహేశ్వరి, కె.వెంకటాపురం

ఉపాధ్యాయులపై పర్యవేక్షణ ఏది?..



ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పోతోంది. మెరుగైన విద్యాబోధన జరగడంలేదు. ఉపాధ్యాయులపై పర్యవేక్షణ లేకుండాపోయింది. తల్లికి వందనం డబ్బులు వేయ లేదు. ప్రైవేటు పాఠశాలల్లో చదివించలేక, ప్రభుత్వ పాఠశాలల్లో ఉంచలేక నలిగిపోతున్నాం.

– అడిగర్ల రేణుక, విద్యార్థి తల్లి

విద్యార్థి దశ చాలా కీలకం

కోటవురట్ల: ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమని, బాల్యం నుంచే మంచి నడివడికను అలవరుచుకోవడం ద్వారా మంచి భవిష్యత్ ఉంటుందని ఎస్ఐ రమేష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ టెక్నాలజీ పెరిగే కొద్దీ మోసాలు తేలికయ్యాయన్నారు. సెల్‌ఫోన్‌కు అలవాటు పడితే విద్యకు దూరమవుతారన్నారు. ఈ దశలో చదువుపై దృష్టి సారించి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గురువులు, తల్లిదండ్రుల పట్ల గౌరవ భావం కలిగి ఉండాలని సూచించారు. బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పట్ల అవగాహన కలిగి, అటువంటి సంఘటనలు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడితే ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్ నాశనం



మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ ధనుంజయరావు

యలమంచిలి రూరల్: మాదకద్రవ్యాల అలవాటుతో భవిష్యత్ నాశనం అవుతుందని యలమంచిలి సీఐ ఎస్.ధనుంజయరావు అన్నారు. మాదక ద్రవ్యాల నివారణకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సంకల్పం పేరిట జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఎట్టి పరిస్థితుల్లో మత్తు పదార్థాల జోలికి పోవద్దని ఆయన సూచించారు. డ్రగ్స్ పర్యవసనాలపై అవగాహన కల్పించేలా వీడియోలు ప్రదర్శించారు. మత్తు పదార్థాల అమ్మకం, వాడకం, రవాణాపై సమాచారాన్ని పోలీసు శాఖకు తెలియజేయాలని విద్యార్థులను కోరారు. ఇందు కోసం ప్రత్యేక ఫోన్ నెంబరు 9392918196 ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. సమాచారం ఇచ్చేవారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్, పట్టణ ఎస్ఐ కె.సావిత్రి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వై.పోలిరెడ్డి పాల్గొన్నారు.

సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న పాయకరావుపేట ఎంపీడీవో జయప్రకాష్‌రావు



మాట్లాడుతున్న మునగపాక ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయం చేసుకుంటూ గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి సూచించారు. మండల పరిషత్ హాలులో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధికి సంబంధించి తప్పనిసరిగా ప్రణాళిక ఏర్పాటు చేసుకుని ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులను ఎంత మేర ఏ విధంగా ఖర్చు చేయాలన్న విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈవోఆర్డీ సోమరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, పలువురు డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: మండలంలోని గ్రామాల అభివృద్ధికి అధికారులు ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీవో జయప్రకాష్‌రావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్య పరిష్కారానికి చేపట్టవలసిన పనులకు రానున్న ఆర్థిక సంవత్సరం 2024-25 సంవత్సరానికి ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఈవోఆర్డీ సిహెచ్.చంద్రశేఖర్, ఆయా శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



కైలాసపట్నంలోని రాజగోపాలస్వామి ఆలయంలో ధ్వజ స్తంభం వద్ద దీపారాధన చేస్తున్న భక్తులు



మునగపాక లింగరాయి గుడిలో పూజలు చేస్తున్న మహిళలు

కోటవురట్ల: కార్తీక మాసంలో ఏకాదశి పర్వదినాన్ని భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కైలాసపట్నంలోని శ్రీరుక్మిణి సహిత రాజగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు రాజగోపాలస్వామికి అభిషేకాలు చేశారు. ధ్వజ స్తంభం, తులసి కోట, ఉసిరి చెట్టు నీడన దీపారాధన చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మునగపాక: మండల వ్యాప్తంగా ఏకాదశి పూజలు మంగళవారం ఘనంగా జరిగాయి. మునగపాక మెయిన్‌రోడ్డులోని లింగరాయి గుడిలో పండితులు సోమశేఖర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఎస్.రాయవరం: ఏకాదశి సందర్భంగా పి.ధర్మవరం రామాలయంలో మంగళవారం హరిభజనలు చేశారు. 24 గంటలు నిర్విరామంగా చేపట్టే ఈ హరి భజనలు ఆకట్టుకున్నాయి.

టమాటా పంటలో సూక్ష్మ పోషక లోపం

నక్కపల్లి: టమాటా పంటలో సూక్ష్మపోషకాల యాజమాన్యం పాటించడం ద్వారా మంచి కాపు దిగుబడి సాధించవచ్చని వ్యవసాయం, ఉద్యానవన శాఖ అధికారులు సూచించారు. మంగళవారం డొంకాడ గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారి ఉమా ప్రసాద్, బీసీటీ-కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ టమాటా పంటలను సందర్శించి పలు సూచనలు చేశారు. ప్రస్తుతం చాలా టమాటా పంటల్లో పూత పిందెగా మారకుండా ఆగిపోయిందని, నెల రోజులుగా ఇలాంటి పరిస్థితి ఉందని రైతులు తెలియజేశారు. అధికారులు మాట్లాడుతూ ప్రధాన కారణం వాతావరణంలో మార్పులని, సూక్ష్మ పోషకాలైన కాల్షియం, బోరాన్, మెగ్నీషియంలను పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రజిత, సురేంద్ర, ఖాశీ, అభ్యుదయ రైతులు దివాణం, శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితేనే మంచి ఫలితాలు



పాటిపల్లి మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో-2 శివనాయుడు

మునగపాక: విద్యార్థులు ఇష్టపడి కష్టపడి చదువుకోవాలని ఎంఈవో-2 బుద్ద శివనాయుడు కోరారు. మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. విద్యార్థులు నోట్ పుస్తకాలతో పాటు మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకాగ్రతతో చదువుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. లక్ష్యం కోసం చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగమణి, క్లస్టర్ రిజర్వుడ్ మొబైల్ టీచర్ కె.లక్ష్మీనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళిక తయారు చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి: గ్రామాల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీవో సీతారామరాజు కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాల య సమావేశ మందిరంలో కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ సాధారణ నిధులతో పాటు ఉపాధి హామీ, జెడ్పీ నిధులతో చేపట్టే పనులకు ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. జమా ఖర్చులకు సంబంధించిన రికార్డులను కూడా సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సత్యనారాయణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆయుష్‌పై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పాయకరావుపేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్ మందులు అన్ని రోగాలకు ఉన్నాయని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని మంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పద్మావతి, డాక్టర్ స్వరాజ్యం తెలిపారు. జాతీయ ఆయుష్ మిషన్ ఆధ్వర్యంలో మధుమేహం నియంత్రణ, తదితర వ్యాధులకు మందులు సరఫరా చేస్తామన్నారు. అనంతరం ఆయుష్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎంపీఎల్ఈవో రాము, ఆశా సిబ్బంది, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మునగపాకలో ఆర్డీవో పర్యటన



రోడ్డు విస్తరణ బాధితులు సమాచారం అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో ఆయిషా

మునగపాక: మండలంలో మంగళవారం అనకాపల్లి ఆర్డీవో ఆయిషా పర్యటించారు. పూడిమడక రోడ్డు విస్తరణలో భాగంగా పోతున్న వ్యవసాయ భూములు, వ్యవసాయేతర భూములను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలోమీటర్ల మేర రోడ్డును విస్తరించనున్న నేపథ్యంలో బాధితులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుల బ్యాంక్ ఖాతా వివరాలు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

'ఉల్లాస్'తో అక్షరాస్యత పెంపు

రాంబిల్లి(యలమంచిలి): గ్రామీణ ప్రాంతాల్లో ఉల్లాస్ పథకంతో అక్షరాస్యత పెంపునకు కృషి చేస్తున్నట్టు రాంబిల్లి ఎంపీడీవో ఎస్.జయమాధురి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె గ్రామాల్లో శిక్షణ ఇచ్చే శిక్షకులకు ఎంపీడీవో కార్యాలయంలో తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పెద్దలకు చదవడం, రాయడం నేర్పాలన్నారు.

మునగపాక: ప్రతి మహిళా విద్యావంతురాలు కావాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి ఆకాంక్షించారు. మునగపాక మండల పరిషత్ హాలులో మంగళవారం ఉల్లాస్ పథకంలో భాగంగా వీవోఏలు, వలంటీర్లు, టీచర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్వాక్రా మహిళలతో పాటు ఇతర మహిళలు కూడా అక్షరాస్యులుగా తయారు కావాలన్నారు. గృహ హింస, వరకట్న వివాహాలపై మరింత అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి సూచించారు.

కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు



మునగపాక మధ్య వీధిలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మునగపాక: మండల కేంద్రమైన మునగపాక మధ్య వీధిలో ఇనుప విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. స్తంభం అడుగు భాగం తుప్పుపట్టి శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందారు. ఈ విషయంపై సాక్షి దినపత్రికలో అటెన్షన్ ప్లీజ్ శీర్షికలో భాగంగా ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం పేరిట ప్రచురితమైన కథనానికి ఆ శాఖ ఏఈ ప్రసాద్ స్పందించారు. శిథిలావస్థకు గురైన స్తంభం స్థానంలో కొత్త స్తంభం ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

జగ్గన్నపేటలో ఏకాహం



జగ్గన్నపేట రామాలయంలో ఏకాహం నిర్వహిస్తున్న భక్తులు

అచ్యుతాపురం: జగ్గన్నపేటలో 12 గంటల ఏకాహం మంగళవారం నిర్వహించారు. కార్తీక మాస ఏకాదశిని పురస్కరించుకొని స్థానిక రామాలయంలో భగవంతుని నామస్మరణ చేస్తూ భక్తులు ఏకాహంలో పాల్గొన్నారు. బీవీ రమణ, కొల్లి అప్పారావు, దొడ్డి కృష్ణవేణి, ఆడారి త్రినాథ్, గోవింద, ముసిలినాయుడు, వెంకటలక్ష్మి, ఎం.ఆదినారాయణ, సత్య, పాల్గొన్నారు.

ఎన్‌డీఆర్ఎఫ్ విన్యాసాలు



విన్యాసాలు నిర్వహిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

అచ్యుతాపురం: పూడిమడకలో మంగళవారం ఎన్‌డీఆర్ఎఫ్ బృందం ఆధ్వర్యంలో విన్యాసాలు నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తీర ప్రాంతంలో శత్రు మూకల కదలికలను పోలీసుల ద్వారా తమకు తెలియజేయాలని సిబ్బంది సూచించారు.